క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ నిర్వహణ పనులు జరగనుండటంతో శనివారం ఆరిలోవ, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విద్యుత్ మరమ్మతులు, రోడ్లకు ఇరుపక్కలా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ బి.సింహాచలం నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పైనాపిల్‌కాలనీ, సీవీడీ కార్యాలయం, శ్రీకృష్ణాపురం, ఎస్.ఎస్.ఎన్ నగర్, ముడసర్లోవ ప్రాంతం, గోల్ఫ్‌క్లబ్, హెల్త్‌సిటీతో పాటు రవీంద్రనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత తదితరులు

అల్లిపురం: నెలరోజుల క్రితం ఫుట్‌పాత్ మీద నిస్సహాయ స్థితిలో కనిపించిన వృద్ధుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆశ్రయం కల్పించారు. అంతే కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి కేజీహెచ్‌లో వైద్యం కూడా చేయించారు. అతను కోలుకోవడంతో డిశ్చార్జి చేయించి ఐదు రోజుల క్రితం షెల్టర్ కి తీసుకొచ్చారు. అయితే గురువారం నుంచి అతని ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో గోపాలపట్నం ఆస్పత్రికి తీసుకెళ్లారు. దారిలో అతను మరణించాడు. దీంతో విషయాన్ని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు తెలియజేసి ఆ అనాథ శవానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించినట్లు మమత తెలిపారు.

ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదినం



అల్లిపురం మసీదు వద్ద నుంచి బయలుదేరిన శాంతి ర్యాలీ

అల్లిపురం: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం యాతపేట మసీదు వద్ద మహ్మద్ ప్రవక్త జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు వద్ద నుంచి ప్రవక్త ప్రవచనాలతో కూడిన నినాదాలతో ముస్లింలు ఈదుల్మలాదినబీజు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అల్లిపురం యాతపేట మసీదు నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ మీదుగా, సరస్వతీ పార్కు, జగదాంబ మీదుగా పాతపోస్టాఫీసుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో చిన్నారులతో సహా అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అరుణ కుమారి

బీచ్‌రోడ్డు: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అరికెల అరుణ కుమారి పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్ రోడ్డులోని కిర్లంపూడి లేఔట్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంపై ఆమె పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ప్రియాంక దండి అరుణ కుమారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ, పార్టీ సీనియర్ నాయకులు చిన్నాబాబు, ఉమ్మిడి భాస్కర్, కల్పన, కాండవ గాయత్రి, వివిధ వార్డుల అధ్యక్షులు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శిరీష కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై బీరుసీసాతో దాడి

బీచ్‌రోడ్: పెదవాల్తేరులోని పోలామాంబ ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం పాత గొడవల కారణంగా మద్యం మత్తులో ఉన్న పూర్ణామార్కెట్‌కు చెందిన పిల్లి నూక అప్పారావుపై వినయ్ బీర్ సీసాతో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నూక అప్పారావును చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్

- రాకపోకలకు కాలనీవాసుల ఇక్కట్లు
- రాత్రి వేళల్లో ఆకతాయిల ఆగడాలు
- మందుబాబుల చిందులతో కాలనీవాసుల బెంబేలు
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు



ఇసుకతోట అంబేడ్కర్‌కాలనీలో పార్కింగ్ చేసిన చిప్స్ మిక్సింగ్ మిషన్‌లు



పితాపురంకాలనీలో పార్కింగ్ చేసిన వాహనాలు



ఇసుకతోట అర్బన్ ఆరోగ్య కేంద్రం రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు



పితాపురంకాలనీ సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు



కృష్ణా కళాశాల రోడ్డులో పార్కింగ్ చేసిన లారీ, వ్యాన్‌లు

మద్దిలపాలెం : ప్రధాన రహదారులపైనా, కాలనీ రోడ్లపైనా అక్రమ పార్కింగ్ సమస్య నగరవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఖాళీ స్థలాలు కనిపించిన చోటల్లా వాహనాలను ఇష్టానుసారంగా పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు, ఇతర ఇబ్బందులు పెరుగుతున్నాయి.అక్రమ పార్కింగ్ కారణంగా కాలనీలలో రాత్రి వేళల్లో ఒంటరిగా నడవాలంటే ప్రజలు భయపడుతున్నారు. పార్క్ చేసిన వాహనాల మాటున కొందరు ఆకతాయిలు, మద్యం సేవించేవారు చేరి, అటుగా వెళ్లేవారితో వాగ్వాదాలకు దిగుతున్నారు. దీంతో స్థానికుల భద్రతకు తీవ్రమైన ముప్పు ఏర్పడుతోంది.

ఇసుకతోట ఆరోగ్య కేంద్రం రోడ్డు (16వ వార్డు) ఇక్కడ అర్బన్ ఆరోగ్య కేంద్రం ఎదురుగా వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయడంతో అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ – వెంకోజీపాలెం ప్రధాన రహదారిపై ప్రైవేట్ వాహనాలు, టాటా వ్యాన్‌లు, ఆటోలు విపరీతంగా పార్క్ చేయడంతో వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పితాపురం కాలనీ సర్వీస్ రహదారిలో కూరగాయల మార్కెట్ నుంచి ఎమ్మెల్సీ ఇంటి వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న భవనం సామాగ్రి, మిక్సింగ్ యంత్రాలను రోడ్డుపైనే ఉంచడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆకతాయిల అడ్డాగా మారిన అక్రమ పార్కింగ్

కాలనీ రోడ్లలో అక్రమంగా పార్క్ చేసిన వాహనాల కారణంగా ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. చీకటి పడితే ఈ వాహనాల మాటున మద్యం సేవించేవారు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. అటుగా వెళ్లేవారితో వాగ్వాదాలకు దిగుతున్నారు. దీంతో ఆ రోడ్ల గుండా ఒంటరిగా వెళ్లాలంటే స్థానికులు భయపడుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంపై ఆరోపణలు

అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పితాపురం కాలనీలో కూరగాయల మార్కెట్ నుంచి మలేరియా కార్యాలయం వరకు, అలాగే 16వ వార్డులోని ఇసుకతోట అర్బన్ ఆరోగ్య కేంద్రం రోడ్డులో లారీలు, ప్రైవేట్ బస్సులు, ఏటీఎం క్యాష్ ఫిల్లింగ్ వాహనాలు, ఆటోలు ఇష్టానుసారంగా పార్క్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఉన్న ఓ పార్శిల్ సర్వీస్ కంపెనీకి చెందిన భారీ లారీలను కూడా రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు.దీనివల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వాహనదారులు వినడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఈ అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'మెడికల్ మాఫియాను పెంచిపోషిస్తున్న కూటమి'



పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యాన్ని దూరం చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని, వెయ్యి రోగాలకు అందుబాటులో ఉన్న సేవలను 3 వేల రోగాలకు విస్తరించారని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు, ప్రతి 2 వేల కుటుంబాలకు ఒక యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలను నిర్మించి వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చంద్రబాబు మెడికల్ మాఫియాతో చేతులు కలిపి 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్రం నుంచి మెడికల్ మాఫియాను తరిమికొట్టి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

హెరిటేజ్ ఫెస్ట్ విజేతలకు బహుమతి ప్రదానం నేడు

తగరపువలస: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గత నెల 2వ తేదీ నుంచి 11 వరకు ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హెరిటేజ్ ఫెస్ట్–2025 పేరుతో నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందించనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీరాధా మదన్ మోహన మందిరంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా వీటిని అందిస్తారు. చిత్రలేఖనం, పౌరాణిక వేషధారణ, భగవద్గీత శ్లోక పఠనం, గాత్ర సంగీతం, నాటకాలు, శాస్త్రీయ సంగీతం, పాట్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించినట్లు హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస తెలిపారు.

కూటమి మోసాలను ఎండగట్టాలి



జీవీఎంసీ 16వవార్డులో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు



ఆదర్శనగర్‌లో వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దిలపాలెం: ఇంటింటికీ ఏడాదికి లక్షల రూపాయలు బ్యాంకులో వేస్తానని బాండ్లు ఇచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబును ఇంటికి సాగనంపడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో వార్డు అధ్యక్షుడు బొల్లంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మేనిఫెస్టోలోని హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల ముందు గడప గడపకు వెళ్లి, ప్రతి ఇంటికీ సంవత్సరానికి లక్షల్లో డబ్బులు ఇస్తామని, దానికి ష్యూరిటీగా బాండ్లు ఇస్తున్నామని చెప్పి ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. ప్రజలు ఈ దగాను, మోసాన్ని తెలుసుకోవాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా తీర్పు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆ కరపత్రంలో ఉన్న స్కానర్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాల వివరాలు తెలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు పోలరత్నం తో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో వార్డులో ...

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీఎంసీ పదో వార్డులో శుక్రవారం 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో ఆదర్శ నగర్‌లోని 79వ బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, ప్రజలకు వ్యతిరేకమైన పాలన సాగిస్తుందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినా ఇంతవరకు ఇవ్వలేదని, అలాగే నిరుద్యోగ భృతి కూడా అమలు చేయలేదని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావు, వార్డు ఇన్‌చార్జి జి.విక్టర్ తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



న్యూట్రిషియన్ వీక్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు

ఆరిలోవ: జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 10వ వార్డులోని బీఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం 'మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్' పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. వివేకానంద నగర్, బాలాజీ నగర్ యూపీహెచ్‌సీల వైద్యులు సాహిత్య, కిరణ్ లలిత ఈ కార్యక్రమంలో పాల్గొని పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మహిళలు స్వయంగా వండిన వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలు వండిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు శంకర్, సాయిరాం, యుష్మా, స్వాతి, సాయిలక్ష్మి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్‌లో గురుపూజోత్సవం



హిడెన్ స్ప్రౌట్స్ టీచర్లను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలో ఉన్న హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, మానసిక దివ్యాంగ విద్యార్థులకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న 30 మంది ఉపాధ్యాయులను విశాఖ నార్త్ ఈస్ట్ క్లబ్ సత్కరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు చెరుకు శ్రీరామమూర్తి మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించడం సమాజ బాధ్యత అని అన్నారు. ఈ ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఉపాధ్యాయులకు శాలువాలు, పూలగుచ్ఛాలు, చీరలు, బట్టలు అందజేశారు. ఈ వేడుకల్లో పాఠశాల వ్యవస్థాపకుడు కండిపల్లి శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు నీలకంఠేశ్వరరావు, సభ్యుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా అన్నసమారాధనలు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న మొల్లి అప్పారావు తదితరులు



అన్నదానంలో వడ్డన చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ముంబై జాగ్వర్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక యువకులు ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహానికి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు చేశారు.

శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్, గిరికిన ధనలక్ష్మి, వాసుపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీ మణికంఠ యూత్, పీవీపీ యంగ్ స్టార్, గణేష్ యూత్ ఆధ్వర్యంలో వేర్వేరుగా శుక్రవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీతల గోవింద్ భక్తులను అన్నప్రసాదం వడ్డన చేశారు. అనంతరం యూత్ బృందం గోవింద్‌ను శాలువ కప్పి సత్కరించారు.

16వ వార్డులో ..

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా 16 వ వార్డు, బొంతలవీధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డన చేశారు. ఈకార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొల్లంగి నాగేశ్వరరావు, ఆవాల గణ, ఆవాల శ్రీను,ప్రసాద్,కష్ణ,గెడ్డవు బాలకష్ణ,మీసాల ప్రదీప్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వేపల్లి జీవితం ఎంతో ఆదర్శం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలు వేస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్, ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి మాట్లాడుతూ, రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా, దేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం నేటి యువతరానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎన్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ కె. రాంబాబు, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఆచార్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా భారత మాజీ రాష్ట్రపతి, ఏయూ మాజీ ఉపకులపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యా విభాగం విశ్రాంత ఆచార్యులైన అట్లూరి శ్యామ్, భాస్కరాచార్యులు, టి. నిర్మల జ్యోతి, ఎం. మదన్మోహన్ లను సత్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలను పెంపొందిస్తూ పిల్లలకు జ్ఞానాన్ని అందించిన భారతీయ ఉపాధ్యాయులు ఆదర్శనీయులని కొనియాడారు. ప్రతి వ్యక్తి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని ఆయన పేర్కొన్నారు. తరతరాలుగా జ్ఞానాన్ని అందిస్తూ, మేధో సమాజాన్ని నిర్మిస్తున్న గురువులందరినీ స్మరించుకోవడం ఎంతో అవసరమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగం ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిలోవలో కుండపోత వర్షం



చినగదిలి రోడ్డుపై చేరిన వర్షం నీరు



ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. సుమారు గంటకు పైగా కురిసిన కుండపోత వర్షానికి కాలువలు పొంగి, మురుగునీరు రోడ్లపైకి చేరింది. సింహాచలం కొండల నుంచి వచ్చిన వర్షం నీటితో బీఆర్‌టీఎస్ రోడ్డు పూర్తిగా నిండిపోయింది. దీంతో పెదగదిలి, చినగదిలి కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే పార్వతీ నగర్ బ్రిడ్జి వద్ద కూడా వరద నీరు నిలిచిపోవడంతో శ్రీకాంత్ నగర్, ఆరిలోవ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం తగ్గిన తర్వాత కూడా నిలిచిపోయిన నీటిలో ప్రయాణించడానికి వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

డాబాగార్డెన్స్: నాలుగు రోజులుగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహనం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. దేవస్థానం వేదపండితులు, అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ఆలోచింపజేసిన నాటికలు



మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతినెల మొదటి శుక్రవారం నాటికల ప్రదర్శనలో భాగంగా శుక్రవారం రెండు నాటికలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్ష్య,కార్యదర్శులు ఎమ్మెస్ఎన్‌రాజు, రాంబాబు, క్రిష్ణాప్రసాద్‌లు జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్స్ వారిచే మనఃసాక్షి, నా గూడు నాటికలు ప్రదర్శించారు. చక్కటి సందేశాత్మకంగా సాగిన రెండు నాటికల్లో నటులందరూ వారి పాత్రలలో జీవించారు.